యాదగిరిగుట్టలో వైభవంగా నిత్యోత్సవాలు


నిత్య తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు వైభవంగా సాగాయి. గురువారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణపుష్పార్చన జరిపించారు. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన, శయనోత్సవం జరిపారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు కొనసాగాయి. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.11,41,912 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు

ఘనంగా గణేశ్ శోభాయాత్ర

గణేశ్ శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, భక్తులు

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 12 : పట్టణంలో టై అండ్ డై అసోసియేషన్, నేతాజీ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహం శోభాయాత్రను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ దీపాల అలంకరణతో ఏర్పాటు చేసిన ప్రత్యేక రథంపై స్వామివారిని ఉంచి కోలాటాలు, భజనలు, డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపు చేపట్టారు. యువత కేరింతలతో డ్యాన్సులు చేశారు. అంతకుముందు స్వామివారి లడ్డూను వేలం వేశారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు గునిగంటి రమేశ్‌గౌడ్, నాయకులు, అసోసియేషన్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

వినాయక పూజల్లో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

వినాయక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 12 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూజలు చేశారు. శివనగర్‌లో శ్రీలక్ష్మీగణేశ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆది దేవుడైన విఘ్నేశ్వరుడిని కొలిచి పనులు చేపడితే అంతా శుభమే కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు తాళ్లపల్లి నాగరాజు, దండెబోయిన అనిల్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, నాయకులు వెంకటయ్య, శ్రీధర్, సాయి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం : అదనపు సీడీపీఓ

అంగన్‌వాడీ టీచర్లు చేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, వైద్యాధికారులు

వలిగొండ, సెప్టెంబర్ 12 : పోషకాలతో కూడిన ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని అదనపు సీడీపీఓ సమీరా అన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో అంగన్‌వాడీ టీచర్లకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐరన్ పుష్కలంగా ఉండే పచ్చని ఆకుకూరలు, తృణధాన్యాలు, గుడ్లు, పాలు, సీ విటమిన్ కలిగిన ఆహారాలను బాలింతలు, గర్భవతులు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు చేసిన వివిధ రకాల పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు స్వర్ణలత, జ్యోతి, వెంకటేశ్వర్లు, జానీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ధనమ్మ, పారిజాత, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలి : ఎంపీడీఓ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 12 : వన మహోత్సవంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఖాళీ ప్రదేశాల్లో, ప్రధాన వీధుల వెంట మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రోజూ పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమావేశంలో ఏపీఓ రమేశ్, ఈసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పల్లివాడలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారి అశ్విన్‌కుమార్

రామన్నపేట, సెప్టెంబర్ 12 : మండలంలోని పల్లివాడ గ్రామంలో సీజనల్ వ్యాధులపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి అశ్విన్‌కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని వాటర్ ట్యాంకులు, ఆర్ఓ వాటర్ ప్లాంట్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి దీన్‌దయాళ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, ఎంపీహెచ్ఏ మల్లేశం, ఏఎన్ఎం గౌసియా, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పనులను పూర్తి చేయాలి : సీపీఎం

మోత్కూరు, సెప్టెంబర్ 12 : మున్సిపాలిటీలో చేపట్టిన రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయడంలో మున్సిపల్ అధికారులు ఏడాది కాలంగా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. 40 ఫీట్ల రోడ్డు విస్తరణ అలైన్‌మెంట్‌ను పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికారులు పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జ్వరంతో వచ్చే పేషెంట్లకు టెస్టులు చేయాలి
- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

గుండాల, సెప్టెంబర్ 12 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సరైన పౌష్టికాహారం తీసుకొని వ్యాధులు సోకకుండా జాగ్రత్త పడాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. ఆసుపత్రి సిబ్బంది మందులు ఇస్తున్నారా.. వైద్యం బాగా చేస్తున్నారా? అని రోగులను అడిగి తెలుసుకున్నారు. మూడ్రోజులకు మించి జ్వరంతో వచ్చే రోగులకు రక్త పరీక్షలు చేయాలని పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. డెంగ్యూ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొంత మంది రైతులు కలెక్టర్‌ను కలిసి రుణమాఫీ జరిగినట్లు లిస్టులో తమ పేర్లు వచ్చినప్పటికీ డీసీసీబీ మోత్కూర్ శాఖలో చార్జ్ క్రియేషన్ కావడం లేదని తెలిపారు. స్పందించిన కలెక్టర్ అసైన్‌మెంట్ భూమి కలిగిన రైతులకు కూడా రుణమాఫీ వర్తించాల్సిందేనని, డీసీసీబీ మోత్కూర్ బ్యాంకు అధికారులతో మాట్లాడాలని తాసీల్దార్ జలకుమారిని ఆదేశించారు. ఆ తర్వాత అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనులను పరిశీలించారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం కొమ్మాయిపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో పాటలు పాడించి ఉత్సాహపరిచారు. కలెక్టర్ వెంట తాసీల్దార్ జలకుమారి, మండల వైద్యాధికారి డాక్టర్ యూనస్, ఎంపీఓ ధనుంజయ్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

నీటి కుంటలో పడి కాడెడ్లు మృత్యువాత

గుండాల, సెప్టెంబర్ 12 : మండలంలోని సీతారాంపురంలో ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి రెండు కాడెడ్లు మృతిచెందాయి. గ్రామానికి చెందిన చేగూరి పాండు గురువారం పత్తి చేనులో గుంటుక తోలిన అనంతరం ఎద్దులను కట్టేయడానికి కొట్టానికి తోలుకెళ్తున్నాడు. ఈ సమయంలో వచ్చిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సు హారన్ కొట్టడంతో బెదిరిన ఎద్దులు వాటి మెడపై ఉన్న కాడితో పరుగెత్తుకుంటూ వెళ్లి సమీపంలోని నీటి కుంటలో పడి అక్కడికక్కడే మృతి చెందాయి. జేసీబీ సాయంతో ఎద్దులను బయటకు తీశారు. ఏఎస్ఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఎద్దుల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని, తమను ఆదుకోవాలని బాధిత రైతు పాండు ప్రభుత్వాన్ని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామన్నపేట, సెప్టెంబర్ 12 : అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు గురువారం పట్టుకున్నారు. బియ్యంతోపాటు వాహనాన్ని సీజ్ చేసి రామన్నపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దుబ్బాక నుంచి రామన్నపేటకు పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందింది. సివిల్ సప్లయ్ చౌటుప్పల్ డివిజన్ డిప్యూటీ తాసీల్దార్ బొక్క బాలమణి ఆధ్వర్యంలో రామన్నపేట శివారులో మహేంద్ర సుప్రో వాహనాన్ని తనిఖీ చేయగా.. 32 బస్తాల్లో సుమారు 20క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించాయి. నిందితులు బట్రోతు శ్రీకాంత్, కుంసోడు నాగులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

వలిగొండ, సెప్టెంబర్ 12 : నిషేధిత గుట్కా ప్యాకెట్లను అక్రమంగా నిల్వ చేసి అమ్ముతున్న దుకాణంపై ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి రూ.44,770 విలువైన గుట్కాలను సీజ్ చేశారు. మండల కేంద్రానికి చెందిన మురారిశెట్టి కుమార్ తన ఇంట్లో నిషేధిత గుట్కాలను నిల్వ చేసి అమ్ముతున్నట్లు పక్కా సమాచారం మేరకు ఎస్ఓటీ పోలీసులు గురువారం దాడి చేశారు. గుట్కా ప్యాకెట్లను సీజ్ చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ యుగంధర్ గౌడ్ తెలిపారు.

పీఏసీఎస్ నుంచి ఆర్థిక సాయం

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 12 : మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన సర్దార్ మైసయ్య (63) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. ఆయన కుటుంబానికి చందుపట్ల పీఏసీఎస్ సభ్యుల డివిడెండ్ నిధి నుంచి రూ.30వేలను సంఘం డైరెక్టర్లు గురువారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు తోటకూరి శంకరయ్య, చింతల వెంకట్‌రెడ్డి, నల్ల లక్ష్మీశంకరయ్య, సీఈఓ దంతూరి నర్సింహ, సంఘం సిబ్బంది గాజరాజు సత్తయ్య, రైతులు పాల్గొన్నారు.

సీపీఎం నేత సీతారం ఏచూరికి నివాళి

చౌటుప్పల్‌లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆ పార్టీ నాయకులు

యాదగిరిగుట్ట : ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబర్ 12 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై ఉద్యమాలను నిర్మించి వామపక్ష విధానాలను కొనసాగించిన వ్యక్తి సీతారాం ఏచూరి అన్నారు. కార్యక్రమంలో నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, బండారు నర్సిం, ఎండీ పాషా పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : ఆరోగ్య సమస్యలతో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో కన్నుమూసిన సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద గురువారం ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ ఏచూరి మృతి పట్ల తీవ్ర ద్రిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 1974లో ఎస్ఎఫ్ఐలో చేరి విద్యార్థుల సమస్యలపై ఏచూరి ఎన్నో పోరాటాలు చేశారన్నారు. 2005లో బెంగాల్ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై దేశంలో విద్యార్థి, యువజన, కార్మిక, కర్షకుల సమస్యలపై రాజ్యసభలో గళం వినిపించి పరిష్కారం దిశగా కృషి చేశారని కొనియాడారు.

ఏచూరికి మృతికి సంతాపం

రామన్నపేట : మండల కేంద్రంలో సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి ఆ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి మాట్లాడుతూ దేశం గొప్ప పోరాట యోధుడిని కోల్పోయిందన్నారు. జీవిత కాలం కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి పేదల పక్షాన దేశస్థాయిలో గళం వినిపించిన వ్యక్తి మృతి దేశ ప్రజలకు తీరని లోటు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జెల్లెల పెంటయ్య, వెంకటేశం, నగేశ్, ఉపేందర్, హన్మంతు, బాలరాజు, సోములు, సత్యం, లెనిన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

'జాతీయ భాష హిందీపై మక్కువ పెంచుకోవాలి'

హిందీ దివస్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

వలిగొండ, సెప్టెంబర్ 12 : విద్యార్థులు జాతీయ భాష హిందీని మక్కువతో చదివి భాషా పరిజ్ఞానం పెంపొందించుకోవాలని మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకోజు భాస్కర్ అన్నారు. పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన హిందీ దివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హిందీ ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో 40 మంది హిందీ ఉపాధ్యాయులు, 350 మంది విద్యార్థులతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు మల్లేశం, ఎండీ జిలానీ, అలీ షరీఫ్, నర్సిరెడ్డి, సయ్యద్ అలీ, అమృతారెడ్డి, కృష్ణప్రసాద్, మహాలక్ష్మి, మాధవి, శేఖర్, శ్రీనివాస్, రంగరాజన్, సత్యం పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి : సీపీఐ

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 12 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులుబాసిన అమరుల స్ఫూర్తితో ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నేటి యువత పోరాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ అన్నారు. రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కొలనుపాకలో అమరులు ఆరుట్ల రాంచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, కానుగు యాదగిరి, బెల్లంకొండ మాధవులు, ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి స్తూపాలకు గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పొన్నబోయిన రవి, పోతు ప్రవీణ్, గిరబోయిన స్వామి, పరశురాములు, మహేందర్, నాగరాజు, నరేశ్, మల్లయ్య పాల్గొన్నారు.

పేదింటి బిడ్డకు గెజిటెడ్ కొలువు

- తొలి ప్రయత్నంలోనే ఏఈఈ ఉద్యోగం సాధించిన సురేశ్
- కోచింగ్‌కు డబ్బుల్లేక ఇంటి వద్దే చదువుకొని పోటీ పరీక్షలకు సిద్ధం

తల్లిదండ్రులతో కిష్టం సురేశ్

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 12 : వారిది నిరుపేద కుటుంబం. రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు. అయినా కష్టపడి ఉన్నత చదువులు చదివిన ఆ యువకుడు సర్కారు కొలువు సాధించాలని పట్టుబడ్డాడు. కోచింగ్‌కు డబ్బుల్లేకపోవడంతో ఇంటి వద్దే ఉండి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. తొలి ప్రయత్నంలోనే గెజిటెడ్ ఉద్యోగం సాధించి శభాష్ అనిపించుకున్నాడు సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన కిష్టం సురేశ్.

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన కిష్టం శ్రీరాములు, తిరుపతమ్మ దంపతులది నిరుపేద కుటుంబం. వారికి ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కొడుకులు. వారు చిన్న పూరి గుడిసెలో ఉంటూ అడవుల్లో దొరికే చింతచిగురు, గేగులు, సీతాఫలాలు తెచ్చి అమ్ముతూ జీవనం సాగించేవారు. కొంత మామిడి తోట కౌలుకు తీసుకుని కూలి పనులు చేస్తూ పిల్లలను చదివించారు. చిన్నతనం నుంచే చదువుల్లో చురుగ్గా ఉండే సురేశ్‌ను బాగా చదివించాలని అమ్మానాన్నలతో పాటు వాళ్ల ఇద్దరు అక్కలు కూడా కూలి పనులు చేస్తూ అండగా నిలబడ్డారు. సురేశ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. పదో తరగతిలో 9.3 గ్రేడ్ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లమో చేశాడు. ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. 2022లో ఉద్యోగ నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేసుకున్నాడు. కోచింగ్‌కు డబ్బులు లేకపోవడంతో ఇంట్లోనే ఉండి చదువుకొని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. తొలి ప్రయత్నంలోనే పబ్లిక్ హెల్త్ మున్సిపల్ ఇంజినీర్ విభాగంలో ఏఈఈ ఉద్యోగం సాధించాడు. ఎన్నో కష్టాలు పడి బతుకు వెళ్లదీస్తున్నామని, తాము పడ్డ కష్టానికి తమ కొడుకు ఉద్యోగం సాధించడం చాలా ఆనందంగా ఉన్నదని సురేశ్ తల్లిదండ్రులు కంటతడి పెట్టారు.

అమ్మానాన్న కష్టాలను దూరం చేస్తా : సురేశ్

నా తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి మా కుటుంబాన్ని పోషించారు. నన్ను చదివించడం కోసం అమ్మానాన్నలతోపాటు మా ఇద్దరూ అక్కలు కూలి పనులకు పోయేవారు. ఉద్యోగం సాధిస్తేనే మా కుటుంబ పరిస్థితులు మారుతాయని నిర్ణయించుకున్నా. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని క్షణం కూడా వృథా చేయకండా ప్రిపేర్ అయ్యాను. ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపాను. తొలి ప్రయత్నంలోనే గెజిటెడ్ ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. అమ్మానాన్నలను, మా కుటుంబాన్ని సంతోషంగా ఉండేలా చూసుకుంటా.

మహిళలు స్వయం కృషితో ఎదుగాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

తుర్కపల్లి, సెప్టెంబర్ 12 : మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వయం కృషితో ఎదుగాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలోని జేఎం ఫంక్షన్‌హాల్‌లో స్వరభారతి, పిలుపు సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వరభారతి మ్యాక్స్ 25వ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మహిళలు ఎందులోనూ తక్కువ కాదని, పురుషులకు దీటుగా స్వయం శక్తితో ఎదిగి కుటుంబానికి ఆర్థికంగా తోడుండడంతో పాటు సమాజంలో ఆత్మగౌరవంతో జీవించాలని అన్నారు. స్వరభారతి మ్యాక్స్ పేద, మధ్య తరగతి మహిళల జీవితాల్లో గణనీయమైన మార్పుకు దోహదం చేస్తున్నదని పేర్కొన్నారు. మహిళల్లో సమష్టితత్వం, పొదుపు సామర్థ్యాలను ప్రోత్సహించడం, ఆర్థిక స్వేచ్ఛపై దృష్టి పెట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సంస్థ ద్వారా పరస్పర సహాయ సహకారాలను అందించుకోవడం, పొదుపు పరపతి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడం, మహిళా సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం ప్రయత్నించడం వంటివి చేపట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళా స్వయంశక్తి సంఘాలకు రుణాలను అందిస్తూ ప్రోత్సహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్‌రెడ్డి, తాసీల్దార్ దేశ్యా, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, పిలుపు సంస్థ డైరెక్టర్లు ఎం.జనార్దన్, నిమ్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పడాల వనిత, మాజీ ఎంపీటీసీ బోరెడ్డి వనజ, స్వరభారతి మ్యాక్స్ అధ్యక్షురాలు కొడారి సుమలత, మేనేజర్ లక్ష్మి పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

నరసింహారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 12 : యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ పట్టణ నాయకుడు కోన్యాల నరసింహారెడ్డి కుమారుడు ఇటీవల మరణించగా, ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. అదేవిధంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న కంతంగూడెం గ్రామానికి చెందిన కమటం వెంకటయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, నాయకులు గడ్డమీది రవీందర్‌గౌడ్, మిట్ట వెంకటయ్య, శ్రీధర్, సాయి ఉన్నారు.

అజీవ సంస్థ సేవలు అభినందనీయం : నాబార్డ్ డీడీఎం

చొల్లేరులో మాట్లాడుతున్న నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 12 : రైతులకు ఏడేండ్లుగా అజీవ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని చొల్లేరు గ్రామంలో అజీవ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ 7వ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజీవ కార్యక్రమాలు మరింతగా విస్తరించాలని, సంస్థ బలోపేతానికి నాబార్డ్ తరపున పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. గ్రామీణ వికాస్ బ్యాంకు ఆర్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకు తరపున రుణాలకు కావాల్సిన పత్రాలను వివరించారు. తొలిసారిగా 2 పాడి పశువులకు రుణాలు అందజేసి, ఆ తర్వాత 10 పాడి పశువులకు కావాల్సిన రుణాలను అందజేస్తామని చెప్పారు. పీస్ సంస్థ డైరెక్టర్ కొక్కలకొండ నిమ్మయ్య మాట్లాడుతూ 4 నెలలుగా చొల్లేరు, మర్రిగూడెం, మహబూబ్‌పేట, సాధువెల్లి గ్రామాల్లోని మహిళా సభ్యులకు గ్రామీణ జీవనోపాధులు, పాడి పరిశ్రమలో మెళకువలపై శిక్షణను విజయం